బీఆర్ఎస్ హయాంలో ఎడమ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు

నాడు సాగునీటి గలగలలు .. నేడు పిచ్చి మొక్కలు

అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా కాలువలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడి మత్తడి ప్రాజెక్టు ఎడమ కాలువ పూడికతీత పనులు చేపట్టి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారుల నిర్లక్ష్యంతో ఎడమ కాలువ పిచ్చిమొక్కలతో నిండి దర్శనమిస్తున్నది. ఈ కారణంగా చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల రైతులకు ఎడమ కాలువ, కుడి పైపులైన్లతో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

- తాంసి, ఫిబ్రవరి 16

నేడు పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన మత్తడి ప్రాజెక్టు ఎడమ కాలువ

నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఉట్నూర్, ఫిబ్రవరి16: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మండలాధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 16: నిర్మల్ శివారులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడం, ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు స్వాగతం



గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌ను సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 16 : నిర్మల్ జిల్లా బాసరలో జరుగుతున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు వెళ్తున్న దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఘన స్వాగతం పలికారు. వారి నివాసంలో పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రేమ్‌సింగ్ మహారాజ్ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన వెంట జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, భక్తులు ఉన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో అగస్టియన్

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 16: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లాల్‌టెక్డిలోని ప్రభుత్వ గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఈవో) పరీక్షా కేంద్రాన్ని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అగస్టియన్ తనిఖీ చేశారు. ఈ పరీక్షకు 320 మందికి గాను 304 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్‌సీవో తెలిపారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.

లక్షణాలు కనిపించకుండా గుండెపోటు వచ్చే అవకాశం ఉంది

ఎదులాపురం, ఫిబ్రవరి 16 : లక్షణాలు కనిపించకుండా గుండెపోటు వచ్చిన ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు సోమాజిగూడ యశోద దవాఖాన కార్డియాలజిస్ట్ పంకజ్ తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని గజానన్ దవాఖానలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు తెలియజేశారు. ఇంద్రవెల్లికి చెందిన చోపడే రాజు(61) లక్షణాలు లేకుండానే గుండెపోటు వచ్చిందన్నారు. విరేచనాలతో వచ్చిన వ్యక్తికి రక్తనాళాలు మూసుకుపోగా గుండెపోటు వచ్చినట్లు గుర్తించామన్నారు. దవాఖానలో అత్యంత అరుదుగా నిర్వహించే శస్త్ర చికిత్స చేసి బాధితుడి ప్రాణాలు కాపాడినట్లు పేర్కొన్నారు. బీపీ తక్కువ అయినా గుండెలో నొప్పి అనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ గజానన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం సరికాదు

మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 16: నిర్మల్ జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించకుండా ఉపాధ్యాయులను ఆన్‌లైన్ పనులు చేయమనడం సరికాదని డెమోక్రెటిక్ టీచర్స్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేంద్రచారి, చంద్రనాగకాంత్ అన్నారు. ఆదివారం నిర్మల్‌లో వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ పనులు చేయడానికి ప్రతి హైస్కూల్‌కు కంప్యూటర్ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించి జూనియర్ అసిస్టెంట్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల మార్కుల ప్రగతి నమోదుకు ప్రతి ఉపాధ్యాయుడికి ట్యాబ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాసరలో భక్తుల రద్దీ

బాసర, ఫిబ్రవరి 16 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు, అక్షరాభ్యాస మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాద కౌంటర్లు, ఆలయ ప్రాంగణంతో పాటు గోదావరి నది వద్ద, బస్టాండ్, రైల్వేస్టేషన్లు భక్తజనంతో నిండిపోయింది.

ప్రతి కార్యకర్త మూడు మొక్కలు నాటాలి

పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం ప్రతి కార్యకర్త మూడు మొక్కలు నాటాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి వృక్షార్చన పోస్టర్ విడుదల చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ దేశం, రాష్ట్రం పచ్చబడడమే ధ్యేయ సంకల్పంతో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో చేపట్టిన ఈ వృక్షార్చనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, సాయి కుమార్, శేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఒక్క చోట చేరి.. జ్ఞాపకాలు పంచుకొని



బేల: 2001-02 బ్యాచ్ విద్యార్థులు

బేల, ఫిబ్రవరి 16: ఆదిలాబాద్ జిల్లా బేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన వారు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

భీంపూర్, ఫిబ్రవరి 16 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌లో 2005-06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం తర్వాత చిన్ననాటి మధుస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ఉట్నూర్, ఫిబ్రవరి 16 : ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వారికి బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

భీంపూర్: అర్లి(టీ) పాఠశాలలో 2005 -06 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉట్నూర్: 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

నేరడిగొండ, ఫిబ్రవరి 16 : తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని నేరడిగొండలో సోమవారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ శిబిరానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రైతులకు అందుబాటులో గడ్డి విత్తనాలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 16: పశువుల కోసం గడ్డి విత్తనాలు దిలావర్‌పూర్ పశువైద్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని డాక్టర్ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్ కార్డును తీసుకువచ్చి రూ.140 చెల్లించి గడ్డి విత్తనాలు తీసుకుపోవాలని పేర్కొన్నారు. ఒక బస్తా 5 కేజీలు ఉంటుందని రైతులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు.

ఆదివాసీ యువతీ యువకులకు శిక్షణ

బోథ్, ఫిబ్రవరి 16: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని పార్డి(బీ) రాయి సెంటర్‌లో ఆదివారం ఆదివాసీ గిరిజన యువతీ యువకులకు ధాత్రి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. సభ్యులు హేమంత్, అరవింద్, గణపతి అటవీ హక్కు, విద్య, పెసా చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాయిసెంటర్ పరిధిలోని గిరిజన గ్రామాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

బేల, ఫిబ్రవరి 16: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ అన్నారు. కంగార్‌పూర్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని విశ్వాసనీయ సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో బేల ఏఎస్ఐలు లింగన్న, జీవన్ కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీ నిర్వహించారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయని సీఐ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

దస్తురాబాద్, ఫిబ్రవరి 16: నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రేవోజిపేట గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ట్రాక్టర్లకు సరైన ధృవపత్రాలు లేని కారణంగా యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి రాష్ట్ర స్థాయి ఉషా పోటీలు

ఎదులాపురం, ఫిబ్రవరి 16 : ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 18, 19వ తేదీల్లో రాష్ట్ర స్థాయి బాలికల ఉషా పోటీలు నిర్వహించనున్నట్లు గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి తెలిపారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్టేట్ మీట్‌కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియాలో భాగంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు 33 జిల్లాల నుంచి క్రీడాకారులు ఆదిలాబాద్‌కు వస్తారన్నారు. రెండు రోజుల పాటు స్టేడియంలో జరిగే పోటీలను తిలకించేందుకు ప్రజలు వచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. అదేవిధంగా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉషా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉషా సంఘం ఆర్గనైజింగ్ చైర్మన్ వీరేశ్, శృతి, పేట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, హ్యాండ్ బాల్ కార్యదర్శి హరిచరణ్, మాధవి, వనిత, దివ్య, కాజల్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరైన మంత్రి సీతక్క, ప్రజా ప్రతినిధులు, నాయకులు

బాసర, ఫిబ్రవరి 16 : నిర్మల్ జిల్లా బాసర గోదావరి నది ఒడ్డున ఆదివారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 286వ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పౌరగాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్, దీక్షగురు ప్రేమ్ సింగ్, మహారాజ్, బంజారాలు, సేవాలాల్ మహారాజ్ భక్తులు హాజరయ్యారు. మంత్రి సీతక్క, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జూపటేల్, జాదవ్ అనిల్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, బంజారా ముఖ్య నాయకులు, పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 16: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన లక్ష్మణ చాంద మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుమలత వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన రేణి మల్లేశ్(56)ను శనివారం రాత్రి మల్లాపూర్ - లక్ష్మణచాంద రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో పక్కన ఉన్న పొలంలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుడిహత్నూర్, ఫిబ్రవరి 16 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని శర్మదాబా సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సంఘటన వివరాలు..మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా కలంబ గ్రామానికి చెందిన ద్యానేశ్వర్ నెవారే గుడిహత్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్యానేశ్వర్ నెవారే బోథ్‌లోని పత్తి జిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నాడు. పని మీద ఆదిలాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

భైంసా, ఫిబ్రవరి 16 : నిర్మల్ జిల్లా భైంసాలోని నర్సింహనగర్ బుద్ధవిహార్‌లో బౌద్ధ బిక్షువు బంతే రాజరతన్ సేనాపతి ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుణేకు చెందిన రమణి, ఆకాశ్, ముథోల్‌కు చెందిన గడ్‌పాలే అంజలి బింబిసార్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డివిజన్‌లోని అంబేద్కర్ యువజన సంఘాలు, మాల మహానాడు, బుద్ధవిహార్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ బాబాలను నమ్మవద్దు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, ఫిబ్రవరి 16 : అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసే నకిలీ బాబాలను నమ్మవద్దని, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులకు చూపించుకోవాలని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ అజారుద్దీన్ బాబా మాటల్లో మోసపోగా నకిలీ బాబాపై కేసు నమోదు చేశారు. ఆదివారం టూటౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కరుణాకర్‌రావు. ఎస్ఐ విష్ణుప్రకాశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ అజారుద్దీన్‌కు బంగారుగూడకు చెందిన యాసిన్ అలియాస్ జనాబ్ డొంగిబాబా జనవరిలో పరిచమయ్యాడు. బాబా షేక్ అజారుద్దీన్‌కు మాయమాటలు చెప్పి తన వద్ద తాయత్తు తీసుకుంటే సమస్యలు తీరిపోతాయని నమ్మించాడు. బాబాను నమ్మిన అజారుద్దీన్ రూ.5,600 తాయత్తుల కోసం ఇచ్చాడు. కాగితాలపై పుర్రె బొమ్మలతో పాటు ఏవో అక్షరాలు రాసిన తాయత్తులు ఇచ్చాడు. వీటిని 45 రోజుల పాటు పడుకునే సమయంలో తలకింద పెట్టుకోవాలని సూచించాడు. బాబా చెప్పిన విధంగా ఇంట్లో పెట్టుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత వింతగా ప్రవర్తించడంతో పాటు భార్యను చితకబాదాడు. దీంతో భార్య, తల్లి అతడిని వదిలి వేరేచోటుకు వెళ్లిపోయారు. బాబా ఇచ్చిన తాయత్తులతో తనకు ఇబ్బంది కలుగుతుందని బాధితుడు ఫిర్యాదు చేయడంతో యాసిన్ అలియాస్ జనాబ్ డొంగిబాబాపై కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి బంగారుగూడలోని బాబా ఇంటిలో సోదాలు చేయగా వింతైన వస్తువులు లభించాయని, ఏ రోగానికి ఏ మంత్రం వేయాలో అందులో రాసి ఉందని డీఎస్పీ చెప్పారు. దీంతో బాబాకు నోటీసులు అందించామని పేర్కొన్నారు. నకిలీ బాబాల గురించి ప్రజల వద్ద సమాచారం ఉంటే అందించాలని, అలాంటి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఉరివేసుకుని ఉపాధ్యాయుడి ఆత్మహత్య

ఎదులాపురం, ఫిబ్రవరి 16: ఉరి వేసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన బానోత్ సంతోష్ నాయక్ (28) జైనూర్ మండలం జామిని పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గత వారం అమ్మాయితో ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఈ నెల 14వ తేదీన తల్లిదండ్రులు నిర్మల్ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో చెల్లెలుతో కలిసి సంతోష్ నాయక్ రాత్రి భోజనం చేసి తన గదికి వెళ్లి పడుకున్నాడు. ఉదయం గది నుంచి అన్నయ్య బయటకు రాలేదు. వెంటనే నిర్మల్‌లో ఉన్న తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల ఉన్న వారికి విషయాన్ని చెప్పింది. తలుపు బద్దలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎదులాపురం, ఫిబ్రవరి 16 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన ముజీబ్ ఖాన్ (53) బస్టాండ్ సమీపంలో ముజ్జు హోటల్ నడిపిస్తున్నాడు. హోటల్ పనులు ముగించుకొని శనివారం రాత్రి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కలెక్టర్ చౌరస్తా స్పీడ్ బ్రేకర్ల వద్ద కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనానికి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న ముజీబ్ ఖాన్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్‌కు తరలించారు. కుమారుడు అజర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కారు నడిపే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

అడుగంటిన పెన్‌గంగ

గుబిడి వద్ద వట్టిపోయిన పెన్‌గంగ

భీంపూర్, ఫిబ్రవరి16: వేసవి రాకముందే ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పెన్‌గంగలో జలం అడుగంటింది. యాసంగి పంటలకు నీటి తడులు, పశువుల దాహార్తి ప్రశ్నార్థకమవుతున్నది . గంగలో నీరు లేక తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు ఇప్పుడు ఆయా పనులకు నాటు పడవ అవసరం లేకుండా నడిచే వెళ్తున్నారు. ద్విచక్ర వాహనాలు సైతం తీసుకెళ్తున్నారు.

భర్త మిస్సింగ్.. భార్య ఫిర్యాదు..

ఎదులాపురం, ఫిబ్రవరి 16: మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాలోని దవాఖానకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి భర్త తిరిగి ఇంటికి రాకపోయేసరికి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. అదిలాబాద్ రూరల్ మండలం అర్లీ(బీ) గ్రామానికి చెందిన చుక్కబొట్ల రాజు(40) ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి భార్య కల్యాణికి మహారాష్ట్ర యావత్మాల్ జిల్లాకు వెళ్లి వస్తానని మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. భర్త ఎక్కడికి వెళ్లిపోయాడంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.